# బ్రాహ్మలు

శ్రీ
ప్రయాగ కోదండరామ శాస్త్రి
(యువ భారతీ సభ)



[దీన్ని మీరెలా అయినా అర్థంచేసుకోండి;-కాని, ఇది వ్రాయడంలో నా వుద్దేశాన్నిమాత్రం వెలిబుచ్చుతాను. బ్రాహ్మలంటే ఎవరో అర్థంచేసుకొని లోకం-వారి గౌరవాన్ని, ఆధిక్యతనూ అణగద్రొక్కే-ందుకు ప్రయత్నించాలనీ, బ్రాహ్మలమనుకొంటున్న ఆ బ్రాహ్మలంతా తమ అబ్రాహ్మణ్యాన్నిగుర్తించి తమ బాహ్మణ్యానికి రాజీనామా యివ్వాలని-మొత్తం మీద బ్రాహ్మలంటే ఎవరో అందరికీ తెలియ జేయాలని.]

మెళ్ళో జందెపు పోగుండి, బ్రాహ్మణ్ణి అనే ప్రతివాణ్నీ లోకం బ్రాహ్మడుగానే అర్థంచేసు కొంటున్నది; ప్రతి అలాంటి వాడూ కళ్లుతెరచేదాకా 'నేనూ బ్రాహ్మణ్నే' అనుకొంటున్నాడు. అది పొరపాటు అంటాను, నేను.

మన పూర్వచరిత్ర విప్పితే (పురాణాలు కానీండి, పుక్కిటికథలు కానీండి-) 'బ్రాహ్మలు' అంటే మోసగాళ్ళు గౌరవ నీయంగా తమకుదా మేర్పఱచుకొన్న ఒకపేరుగా కనబడుతుంది. అసలు ఈ బ్రాహ్మమతం పుట్టుకలోనే మోసం వుంది. ఆమోసాన్ని ప్రజలపై మృదువుగా, హితవుగా ప్రయోగించిన, ప్రయోగించగల—మోసగాళ్ళు బ్రాహ్మలయినారు. రాజాస్థానాల్లో, రాజ్యాంగాల్లో-మనుష్యులకు సంబంధించిన ప్రతి చిల్లర విషయంలోకూడా గౌరవంతోకూడిన వీరి అధికారమే తాండవించింది. ఈ మంత్రముగ్ధులైన అమాయకులంతా నానా హీన కులాల వాళ్లుగా పరిగణింప బడ్డారు. ఆ హైన్యమునకు తిరుగబడి, తమవ్యక్తిత్వాలను జూపినవారంతా వీర స్వర్గాని (!-?) కెక్కారు. బ్రాహ్మలు అటు రాజులదగ్గరా, ఇటు ప్రజలదగ్గరా గౌరవంతో, అధికారంతో కావలసిన కాంతా కనకా

లను సేకరించుకొన్నారు. లోకానికి ఇది ఒకవిధమైన అలవాటై తెలియని ఓర్పునేర్పింది. ఈ సందర్భంలో బ్రాహ్మలకు 'దేవుడు (?)' బాగా వుపయోగించాడు. పురుష ప్రయత్నానికి 'దైవం' అనుకూలించింది.—?! హేమా హేమీలవంటి రాజులు అజ్ఞానంవల్ల నయితేనేం, అసమర్థతవల్ల నయితేనేం, భాగస్థులు కావడం వల్ల నయితేనేం- బ్రాహ్మల గురుత్వాన్నే, శాసనం లేని వారి నిరంకుశత్వాన్నే ఆ శాసనానికి లొంగి అయితేనేం, మూఢ విశ్వాసాలు నాటుకొని అయితేనేం-'కర్మమంటూ, ఒకరి ధర్మమంటూ' ప్రజలు అనుసరించారు. ఇంతా చేసింది బ్రాహ్మలు!

ఈ బ్రాహ్మలే తమ ఆధిక్యతకోసం లోకాన్ని-పుక్కిటి పురాణాల్లో, ధర్మ సూత్రాల్లో (ఇవన్నీ ఉచ్చులు-) పెట్టి-నిర్వీర్యం చేసారు. ఇప్పటికీ మనలో అతుక్కున్న ఆ చచ్చు, లేక-పుచ్చు వదలకుండా వుంది.

ఈ బ్రాహ్మలపీడ అచ్ఛగా మన భారతదేశానికే అనుకొంటారేమో! ప్రపంచం అంతటావుంది. ఇప్పటికీ వుంది! సామ్రాజ్యవాదం క్రిందవున్న అన్నిదేశాల్లో. ంకావుంటుంది! ఇప్పటి బ్రాహ్మణ భేషజం ప్రాత రకంగానూ, క్రొత్తరకంగానూ వుంటుంది. ఇందులో మొదటి తరగతి పలుకుబడితోనూ, రెండోతరగతి అధికారంతోనూ మోసగిస్తూ వుంటాయి. మొత్తానికి రెండు రకాలవారూ బంగారుమేడలో మెత్తటి సోఫాల్లో వెలకన్నెల కౌగిళ్లలో ఓలలాడుతూ వుంటారు. బ్రాహ్మలంటే నిజంగావారు. నిత్యం, కర్మలుచేయించే పురోహితులు వారి ప్రతినిధులు. తెలిసో, తెలియకో వారి ప్రాతినిధ్యాన్ని వహించి, లోకంలో మోసాన్ని పాదుకొల్పేది యీ ప్రతినిధులే. యథార్థానికి వీరు పొట్టకూటి దొంగలు! అంతే-అదీ యిదీలేక మేమూ బ్రాహ్మల మనుకొనే వారంతా అజ్ఞానంవల్ల బ్రాహ్మలమోసంలో మునిగిపోతున్న అభాగ్యులు.

ఓ బ్రాహ్మల మనుకొంటున్న అభాగ్యుల్లారా! మీరుకాదు బ్రాహ్మలు. మీరంతాహీన (!)కులాల వాళ్లే మనమంతా ఒకటే! మీలో ఆవర్గచైతన్యం కలుగక పోవడం వల్లనే మీరలా భ్రమిస్తున్నారు. మీ బ్రహ్మత్వాన్ని తన్నేసి రండి! మనమంతా ఒకటే—

